పాసింగ్ అవుట్ పరేడ్



ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్లు దుండిగల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ పాసింగ్ అవుట్ పరేడ్-2023లో శనివారం పాల్గొన్నారు. అవుట్ పరేడ్ 212 ఆఫీసర్స్ కోర్సు కోసం కంబైన్డ్ గ్యాడ్యుయేషన్ పరేడ్ (సీజీపీ) నిర్వహించారు. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ మల్లేశ్, 24 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మండల పరిషత్ కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్

మేడ్చల్: మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ప్రజా ప్రతినిధులు, అధికారులు వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాలలో పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి 22 మందికి పంపిణీ చేశారు. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయలంలో చైర్ పర్సన్ దీపికనర్సింహ్మారెడ్డి 29 మందికి చెక్కులను అందజేశారు.

బాబోయ్ కుక్కలు



మేడ్చల్: నియోజకవర్గంలోని మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల పరిధిలో మండలలోని వివిధ గ్రామాలలో వీధీ కుక్కల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలు వీధుల్లో తిరుగుతూ చిన్న పిల్లలను, మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక విభాగం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలి



పోలీస్ స్టేషన్‌లో వినతి అందజేస్తున్న నాయకులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఈడబ్ల్యూఎస్ కాలనీ, బాలాజీనగర్, వేమననగర్, మేడపాటి నగర్, పటేల్ నగర్ కాలనీలో చోరీల నివారణకు పోలీస్ పికెట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఘట్‌కేసర్ పీఎస్‌లో అడిస్ ఎస్సై అశోక్‌కు స్థానిక నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఆయా కాలనీల్లో ఇటీవల పలు చోరీలు జరిగాయని లేఖలో పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజల భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో దేవేందర్ ముదిరాజ్, రాధాకృష్ణముదిరాజ్, శశిధరన్, నాగభూషణం, గోపాల్‌గౌడ్, లక్ష్మయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

ఘనాపూర్‌కు ఆర్టీసీ బస్సులు నడపాలి



ఆర్టీసీ అధికారికి వినతి అందజేస్తున్న మహేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఆ గ్రామ సర్పంచ్ గోపాల్ రెడ్డి చెంగిచెర్ల ఆర్టీసీ డిపో అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోకి బస్ సౌకర్యం లేకపోవడంతో స్థానిక విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలతో పాటు కేపీఆర్‌ఐటీ కళాశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కరోనాకు ముందు బస్సులు నడిపేవారని తెలిపారు. లేఖ అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ రూప్‌సింగ్‌నాయక్, సురేశ్ నాయక్ పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన చైర్ పర్సన్



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్ నర్సరీని చైర్ పర్సన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరితహారం కార్యక్రమానికి అవసరమైన మొక్కలు పెంచాలని, నర్సరీ పనుల్లో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. పల్లె ప్రవృతివనంలోని మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజూ నీరందించాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు పెంచాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: వాసవి గ్రూప్ చైర్మన్ పుట్టినరోజు సందర్భంగా శనివారం మచ్చబొల్లారంలోని ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుప్రియ, డాక్టర్ సంధ్య, డాక్టర్ యజ్ఞాస్‌లు విద్యార్థులకువైద్య పరీక్షలు చేశారు.

నిరుపయోగంగా ఉన్న మేడ్చల్ రైతు బజార్







రోడ్లపై పండ్ల,పూల దుకాణాలు

మార్కెట్ కల నెరవేరేనా?

మేడ్చల్: మేడ్చల్ గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయికి ఎదిగి ఏళ్ళు గడుస్తున్నా వసతులు మాత్రం మెరుగుపడటం లేదు. లక్ష జనాభా వరకు మేడ్చల్, పరిసర ప్రాంతాల, గ్రామాల ప్రజల అవసరాల కోసం కనీసం ఒక మార్కెట్ లేకపోవడాన్ని బట్టి చూస్తే మేడ్చల్ పట్టణంలో వసతులు ఏవిధంగా ఉన్నాయో అర్థమవుతుంది.

మేడ్చల్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో కింది బస్తీలోని చెరువు వద్ద చేపల మార్కెట్, అక్కడే కూరగాయాల మార్కెట్ ఏర్పాటు చేశారు. ఓటర్లు 10 వేల నుండి 40 వేల మందికి పెరిగినా మార్కెట్ మాత్రం అదే ఉంది. దీంతో అధికంగా కూరగాయాలు కావాలంటే నగరంలోని బోయిన్ పల్లికి పరుగెత్తాల్సిందే.

మార్కెట్ లేని మేడ్చల్...

చిన్న చిన్న పట్టణాల్లో గత ప్రభుత్వాలు ఇంటగ్రేటెడ్ మార్కెట్‌లు అభివృద్ధి చేశాయి. అయితే మేడ్చల్‌లో మాత్రం ప్రత్యేక మార్కెట్ లేకుండా పోయింది. చేపల కోసం కింది బస్తీలో, మటన్, చికెన్ కోసం రోడ్ల వెంట, కూరగాయల కోసం రెండు మూడు చోట్ల, లేదా వారాంతపు సంతలు నిర్వహించే కాలనీలలో సాయంత్రం పూట తిరగాలి. పండ్లు, పూలు కావాలంటే



వారాంతపు సంతలో జనం

వివేకాంద విగ్రహం నుండి మార్కెట్ వరకు తిరగాలి. ఇలా ఒక్కో వస్తువు కోసం ఒక్కో ప్రాంతంలో తిరగాల్సి వస్తుంది.

వారాంతపు సంతలపైనే అధారం...

పట్టణంలో ప్రత్యేక మైన మార్కెట్ లేకపోవడంతో వారాంతపు సంతలపైనే అందరూ ఆధారపడుతున్నారు. సంతలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఒక్కో రోజు ఒక్కో కాలనీలలో నిర్వహిస్తుండటంతో ఆ కాలనీలకు వెళ్ళి ప్రధానంగా కూరగాయాలు, పండ్లు, ఇతర వస్తువులు కోనుక్కోవాల్సి వస్తుంది. ప్రతీ రోజు పట్టణంలోని ఏదో ఒక కాలనీలో సంత కొనసాగుతుంది. ప్రజలు అధికంగా సంతలకే వెళ్ళి వస్తువులు కోనుగోలు చేస్తున్నారు.

నిరుపయోగంగా రైతు బజారు..

మేడ్చల్ రైల్వే స్టేషన్ రోడ్డులో రైతులు, వినియోగదారుల కోసం రైతు బజారు ఏర్పాటు చేసినా దాంతో పెద్దగా ప్రయోజనం లేకుండాపోయింది. మేడ్చల్ ప్రాంతంలో రైతులు పండించి కూరగాయాలు విక్రయించే స్థితి లేకపోవడంతో రైతు బజారు ఏర్పాటు ఉద్దేశం నేరవేరలేదు.

రోడ్లపైనే వ్యాపారాలు..

పాలకులు స్పందించి మటన్ ,చికెన్ షాపులు, పూలు పండ్లు, కూరగాయాల షాపులు రోడ్లపై నుండి తరలించి రైతు బజారు లో ఏర్పాటు చేయిస్తే రోడ్లపై ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి.

ముగిసిన స్పోర్ట్స్ మీట్



మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు సాగిన స్పోర్ట్స్ మీట్ శనివారం సాయంత్రం ముగిసింది. టెక్‌ట్రోఫీ-2023 పేరిట నిర్వహించిన ఇంటర్ కళాశాలల క్రీడా పోటీల్లో పలు యూనివర్సిటీలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవిలత విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 28వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో హిల్ ఆఫ్ హోప్ సొసైటీ సహకారంతో శనివారం కాలనీలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు శివరాణి, క్రాంతి కిషోర్, పార్వతి, మీనా, స్రవంతి, మంజుల, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్లపైనే ధాన్యం



నూతన్‌కల్ రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం

మేడ్చల్ రూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కల్లాలు కరువవ్వడంతో ధాన్యం ఆరబెట్టేందుకు రహదారులనే కల్లాలుగా మారుస్తున్నారు. రోడ్లను 50 శాతం ఆక్రమించుకుని వరి ధాన్యాన్ని ఎండబెడుతుండడంతో ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆరబెడుతూ సాయంత్రం రోడ్లపైనే ధాన్యాన్ని కుప్పలుగా ఉంచడంతో రాత్రిళ్లు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్లాలు ఏర్పాటులో అధికారుల విఫలమవ్వడంతోనే రోడ్లు కల్లాలుగా మారుతున్నాయి. ప్రధానంగా మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్-నూతన్‌కల్, రాయిలాపూర్- శ్రీరంగవరం, రావల్‌కోల్-బస్వాపూర్ రహదారుల్లో రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. రహదారులను 50 శాతం వరకు రోడ్డును ఆక్రమించుకుని ధాన్యం పోస్తున్నారు. సాయంత్రం సమయంలో వాటిని కుప్పలుగా మార్చి వాటి పక్కన రాళ్లను అడ్డుగా పెడుతున్నారు.

క్రీడాకారులకు అభినందనలు



వాలీబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న చైర్మన్ గౌతంరావు, కార్యదర్శి మనోహర్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) వాలీబాల్ క్రీడాకారులను ఆ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్ గౌతంరావు, కార్యదర్శి జి.మనోహర్‌రెడ్డి శనివారం అభినందించారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐటీ కళాశాలలో జరిగిన ఆలిండియా వాలీబాల్ టోర్నీలో అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల వాలీబాల్ క్రీడాకారులు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాలలో వాలీబాల్ క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్, సివిల్ హెచ్‌ఓడీ రామకష్ణ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నాలా పనులు పూర్తి చేయండి

మల్కాజిగిరి: ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నాలా పనులు పూర్తి చేయాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ కాంట్రాక్టర్‌ను కోరారు. బాలసరస్వతీనగర్ కాలనీలో నాలా పనులు ఆగిపోవడంతో కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొని వచ్చారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేయలేకపోతున్నామని కాంట్రాక్టర్ తెలిపారు. బిల్లులు రావడానికి చర్యలు తీసుకుంటామని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పనులు ప్రారంభించాలని కోరడంతో కాంట్రాక్టర్ అంగీకరించారు. సమస్యను పరిష్కరించడానికి అధికారులతో సమావేశం నిర్వహిస్తే ఈఈ హాజరు కాకపోవడం భాధ్యతారాహిత్యమని కార్పొరేటర్ శ్రవణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థి ఆత్మహత్య



నిఖిల్ గౌడ్ (ఫైల్)

ఉప్పల్: పదవ తరగతి విద్యార్థి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్, బాలాజీనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. నారాయపురం ప్రాంతానికి చెందిన నరసింహా గౌడ్ వృత్తి రీత్యా ఇసుక వ్యాపారి. రామంతాపూర్‌లో కుటుంబ సమేతంగా ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. చిన్న కుమారుడు నిఖిల్ గౌడ్(15) రామంతాపూర్‌లోని రాజేంద్రనగర్‌లోని అమ్మ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. శనివారం తల్లిదండ్రులు చౌటుప్పల్‌లోని శుభకార్యానికి వెళ్లారు. పెద్ద కుమారుడు కళాశాలకు వెళ్లాడు. నిఖిల్ గౌడ్ ఇంట్లోనే ఉన్నాడు. మధ్యాహ్నం తల్లి దండ్రులు పక్క ఇంటికి ఫోన్ చేసి నిఖిల్ గురించి ఆరా తీశారు. అయితే గడియపెట్టుకుని ఇంట్లోనే ఉన్నాడని తలుపులు తెరవడం లేదని సమాచారం ఇచ్చారు. తలుపులు పగుల గొట్టి లోనికి వెళ్లి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఇదే విషయాన్ని స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్న పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. వీరారెడ్డి కాలనీలో రూ 14 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అన్ని డివిజన్లలో తీర్మానం చేసి పెండింగ్ ఉన్న పనులను త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పొద్దుటూరి శోభారాణి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి



కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని భవానీనగర్‌లో రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానిక కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కోరారు. ప్రస్తుతం ఉన్న 50 ఫీట్ల రోడ్డును వెడల్పు విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కాసం మహిపాల్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రమావత్ బాల్య (ఫైల్)

శామీర్‌పేట్/మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు ఒక్కడికక్కడే మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారిన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం తండా గ్రామానికి చెందిన రమావత్ బాల్య(50), భార్య లక్ష్మి అతని సోదరుడి కుమారుడు రమావత్ బీమాలు శుక్రవారం వరి ధాన్యాన్ని బియ్యం మార్పిడి చేయించేందుకు ట్రాక్టర్‌లో శామీర్‌పేట్ మండలం తుర్కపల్లిలోని రైస్‌మిల్ కు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు ట్రాక్టర్‌పై బయలుదేరగా రైస్‌మిల్ నుండి రాజీవ్ రహదారిపైకి వస్తున్న క్రమంలో నగరం వైపు వస్తున్న లారీ వీరి ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న బీమా, పక్కన కూర్చున్న రమావత్ బాల్యలకు తీవ్ర గాయాలపాలయ్యాయి. బాల్య అక్కడికక్కడే మరణించగా డ్రైవర్ బీమా పరిస్థితి విషయంగా ఉంది. ట్రాక్టర్ ట్రాలీలో కూర్చున్న లక్ష్మి గాయాలపాలైంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రాచకొండ సీపీని కలిసిన జెడ్పీ చైర్మన్



ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిశారు. నగరంలోని సీపీ కార్యాలయంలో శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అభినందనలు తెలియజేశారు.

విశేషపూజలు



కీసర: కీసరలో నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ పూజల్లో భాగంగా దేవాలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు వేద పండితులు విశేషపూజలను నిర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన సమావేశంలో ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అద్యక్షుడిగా శాడగొండ కరుణాకర్ రెడ్డి, కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా మురళీ, చైర్మన్ రమేష్, సలహాదారులగా రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా ఎస్.సతీష్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి.సంయుక్త కార్యదర్శులుగా డి.రాజేష్ రెడ్డి, వి.వి.నర్సింహా రెడ్డిలను ఎన్నుకున్నారు. పీర్జాదిగూడ నగర మేయర్ జక్కా వెంకట్ రెడ్డి హాజరయ్యారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ రవీంద్రనగర్ కాలనీలో రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆమె అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, ఏఈ సాయికిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రాథోడ్, బీజేపీ నాయకులు రాఘవ రెడ్డి, సంజయ్ పటేల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దక్కన్ స్ప్రింగ్ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

మల్లాపూర్: నాచారం దక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్‌కు ప్రతిష్టాత్మక టైమ్స్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ 2023 అవార్డు లభించింది. బెస్ట్ స్కూల్ ఫర్ ఫ్యూచరిస్టిక్ ఎడ్యుకేషన్ విభాగంలో అవార్డు వరించింది. బాలీవుడ్ హిందీ నటుడు అనిల్ కపూర్ చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపల్ సుమా మీనన్, వైస్ ప్రిన్సిపల్ అక్కినేని స్వర్ణ అవార్డును అందు కున్నారు.

రూ.40 లక్షలతో పార్కు సుందరీకరణ పనులు



పార్కు పనులను పరిశీలిస్తున్న మేయర్ కావ్య, కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: ప్రజలు సేద తీరేందుకు పార్కును అద్భుతంగా మార్చుతున్నామని మేయర్ మేకల కావ్య అన్నారు. హెచ్ఎండీఏ ప్రత్యేక నిధులు రూ.40 లక్షలతో చెన్నాపురంలోని పట్టణ ప్రకృతి వనంలో పార్కు సుందరీకరణ పనుల ఏర్పాట్లను శనివారం మేయర్ కావ్య, కమిషనర్ రామలింగంతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ మాధవచారి, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ సందీప్, శానీటరీ సూపర్‌వైజర్ కృష్ణప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

42 కిలోల గంజాయి స్వాధీనం



పోచారం: అక్రమంగా విక్రయిస్తున్న 42 కిలోల గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లయ్య తెలిపిన మేరకు.. ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, జిల్లా టాస్క్ ఫోర్స్, ఎస్‌టీఎఫ్ బృందాలు చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఐదు బ్యాగులతో ముగ్గురు వ్యక్తులు స్టేషన్ నుండి బయటకు వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. వారి వద్ద 21 గంజాయి ప్యాకెట్లు దొరికాయి. ఒక్కో ప్యాకెట్ రెండు కిలోల బరువు ఉంది. మొత్తం స్వాధీనం చేసుకున్న 42 కిలోల గంజాయి విలువ సుమారు రూ. 12 లక్షలు ఉంటుంది. నిందితులను బీహారకు చెందిన అమ్రిత కుమారి (23), ఢిల్లీకి చెందిన మంజు శర్మ (32), మహారాష్ట్రకు చెందిన రవీంద్ర బిప్రచంద్ పాత్రో (52)గా గుర్తించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మేడిపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. బోడుప్పల్ శోలె బార్ ఎదురు సందుచివరలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(30) అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉన్నాడని పోలీసులు తెలిపారు. అతనికి సంబంధించిన ఎటువంటి వివరాలు తెలియరాలేదని తెలిపారు. మేడిపల్లి పోలీసులు మృత దేహాన్ని గాంది ఆసుపత్రి శవగారానికి తరలించామని తెలిపారు.

అడిషినల్ ఏజీకి అభినందనలు

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడిషినల్ అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన రజనీకాంత్‌రెడ్డిని శనివారం బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న రజనీకాంత్‌రెడ్డికి ఈ పదవికి ఎంపిక కావడం ఎంతో అభినందనీయమన్నారు. రజనీకాంత్‌రెడ్డిని కలిసిన వారిలో సహకార బ్యాంక్ డైరెక్టర్ జడిగె రమేష్‌యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిగూడలో కార్పొరేటర్ పాదయాత్ర

కాప్రా: క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి శనివారం ఎల్లారెడ్డిగూడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిగూడలో నెలకొన్న సమస్యలు స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. బస్టాండ్ సమీపంలో నాలా ప్రమాదకరంగా ఉందని తెలిపారు. వీధి దీపాలు, తాగునీటి పైప్‌లైన్, స్మశానవాటికలో సమస్యలు, ఎల్లారెడ్డిగూడకు వచ్చే ఆర్టీసీ బస్సు 43, 3వై ని పునరుద్ధరించాలని కోరారు. స్థానికుల సమస్యలు విన్న కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి వాటన్నింటినీ నెరవేర్చేందుకు కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

చెరువులను పరిశీలించిన అధికారులు

బోడుప్పల్: బోడుప్పల్ కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, మల్లాపూర్ ఐలా అధికారులు శనివారం బోడుప్పల్‌లోని పలు చెరువులను సందర్శించారు. రా చెరువు, సుద్ధకుంట, చింతల చెరువు నాలా, ఇతర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటి శాంపిల్స్‌ను తీసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చెరువుల పరిరక్షణతోపాటు సుందరీకరణకు శ్రీకారం చుడతామన్నారు.